ప్రజాశక్తి

బుధవారం 29 మార్చి 2023 5 అనంతపురం





డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

కార్మిక సంఘం నాయకులపై దాడి హేయం

◆ఉరవకొండ సిఐను సస్పెండ్ చేయాలి

◆సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సమస్యల పరిష్కారం కోరుతూ శాంతి యుతంగా నిరసన తెలుపుతున్న శ్రీరామరెడ్డి తాగునీటి పతకం కార్మికులపై ఉరవకొండ సిఐ అకారణంగా దుర్భాషలాడి దాడి చేయడం హేయమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు పేర్కొన్నారు. తక్షణం సిఐను సస్పెండ్ చేసి, ఆయనపై శాఖాపరమైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంతకల్లు డీఎస్పీ నరసింగప్పను మంగళవారం కలసి వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి నీటిని సరఫరా చేసే కార్మికులు వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సమ్మె చేస్తున్నారని చెప్పారు. ఈనెల 19వ తేదీ రాత్రి ఉరవకొండ సిఐ హరినాథ్ యూనియన్ నాయకులపై అకారణంగా దాడిచేసి, నానా దుర్భాషలాడారని చెప్పారు. కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఎస్ఆర్ఇన్‌ఫ్రా కాంట్రాక్టర్‌కు అనేక సార్లు విజ్ఞప్తులు చేశారన్నారు. ఏళ్ల తరబడి ఆ సమస్యలు పరిష్కారం కాని నేపథ్యంలో కార్మికులు సమ్మెనోటీసు ఇచ్చి మార్చి 19 నుంచి నిరవధిక సమ్మెలోక వెళ్లారన్నారు. 20వ తేదీ రాత్రి పిఎబిఆర్ డ్యామ్ 11 గంటల సమయంలో ఉరవకొండ సిఐ హరినాథ్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, సంజప్ప, గంగాధర్, ఆనంద్‌లను పిలిపించి 'సమ్మెచేయడానికి మీరెవర్రా.. మీకేమి అధికారం ఉంది' అంటూ నానా దుర్భాషలాడి దాడి చేశారన్నారు. అంతటితో ఆగకుండా వారిని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి బలవంతంగా తెల్ల కాగితాలపై సంతకాలు పెట్టించుకున్నారని తెలిపారు. ఈ విషయాలు బయటకు చెబితే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతామని భయపెట్టారన్నారు. సమ్మె చేయడం కార్మికుల హక్కు అన్న విషయం సిఐకు తెలియకపోవడం విచారకరం అన్నారు. ఫ్రెండ్లీ పోలీసు అంటూ ఇలా బెదిరింపులకు దిగడం పోలీసు శాఖకే మాయని మచ్చ అన్నారు. కార్మికులపై దౌర్జన్యం చేసి, బెదిరింపులకు దిగిన సిఐను వెంటన సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.నాగరాజు, ఉపాధ్యక్షులు సి.రమేష్, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రంగారెడ్డి, ఎంఎటియు ఆర్గనైజర్ ఎం.నాగరాజు, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం యూనియన్ అధ్యక్షుడు బి.నాగరాజు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, రైతు సంఘం కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, కెవిపిఎస్ డివిజన్ కార్యదర్శి జగ్గలి రమేష్, సిఐటియు నాయకులు తిమ్మప్ప పాల్గొన్నారు.

'పది'ంతల శ్రద్ధ..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అక్షర క్రమంలో ముందున్న అనంతపురం జిల్లాను పదవ తరగతి ఉత్తీర్ణతలోనూ అగ్రభాగాన నిలిపే లక్ష్యంతో విద్యా శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. 'అనంత సంకల్పం' పేరుతో ప్రత్యేక కార్యచరణను రూపొందించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా వారి విద్యాభ్యాసం జరుగుతున్న తీరును కూడా ఇళ్ల వద్దకెళ్లి ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి మెరుగైన ఫలితాలు వచ్చేలా 'పది'ంతల ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది 35,305 పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందులో 30 వేల మంది రెగ్యులర్ పరీక్ష రాస్తుండగా తక్కిన వారు గతంలో ఫెయిల్ అయిన విద్యార్థులున్నారు. జిల్లాలో 313 ప్రభుత్వ పాఠశాలల్లో 17,249 మంది విద్యార్థులు ఈ సారి 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు.



◆టెన్త్ ఫలితాల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుల కార్యాచరణ

◆'అనంత సంకల్పం' తో ముందుకు

◆పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపుపై దృష్టి



చదువుతున్నారా.? లేదా.? అన్న పర్యవేక్షణ సైతం చేపడుతున్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు విద్యా శాఖ చేపడుతోంది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయి అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 139 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. జిల్లా కేంద్రం అనంతపురం నగరంలోనే 30 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు అధికారుల నియామకాలు చేశారు. విద్యార్థుల్లోనూ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలను సైతం ఆ శాఖ చేపడుతోంది.



అనంత సంకల్పం కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ తెలుసుకుంటున్న డిఇఒ

ప్రభుత్వ పాఠశాలల్లో 'అనంత సంకల్పం'

గతేడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అనంతపురం జిల్లా ఆఖరు భాగాన నిలిచింది. 49.70 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఈ శాతాన్ని ఈ ఏడాది పెంపొందించేందుకు విద్యాశాఖ 'అనంత సంకల్పం' పేరుతో ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. దీన్ని వారం వారం జిల్లా కలెక్టర్ సమక్షంలో పర్యవేక్షించడం జరుగుతోంది. ఇందులో భాగంగా ఏడు రౌండ్లలో విద్యార్థులకు అదనపు క్లాసులు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం అదనపు క్లాసులు తీసుకున్నారు. ప్రతి వారంవారం పరీక్షలు నిర్వహించారు. ప్రీ ఫైనల్ కూడా అయిపోయాయి. పూర్తి స్థాయి పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ముఖ్యమైన సబ్జెక్టులపై మరోమారు విద్యార్థులకు బోధించడం జరుగుతోంది. విద్యార్థులు ఇళ్ల వద్ద

ఉత్తీర్ణత శాతం పెంచుతాం

గతేడాది పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చివరిగా అనంతపురం జిల్లా ఉంది. ఈసారి ఉత్తీర్ణత శాతం పెంచుకునే దిశగా ప్రణళికను రూపొందించాం. మంచి ఫలితాలు వచ్చేందుకు అవసరమైన కార్యచరణను చేపట్టాం. విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఇళ్ల వద్ద ఏ విధంగా చదువుతున్నారన్నది కూడా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థుల్లోనూ మానసిక స్థైర్యాన్ని నింపి మంచి మార్కులు సాధించే విధంగా కృషి చేస్తున్నాం.

సాయిరామ్, జిల్లా విద్యాశాఖ అధికారి, అనంతపురం.



కొండవద్ద జరుగుతున్న మట్టి తవ్వకాలు

విద్యుత్ బకాయిలు చెల్లించండి

గార్లదిన్నె: రైతులు తమ బోరు బావులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలని ఎఇ శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో వ్యవసాయ బోరుబావులకు సంబంధించి రూ.60 లక్షల వరకు విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కావున రైతులు వెంటనే బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో సర్వీసులను తొలగిస్తామని హెచ్చరించారు.



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని చేసి ప్రారంభిస్తున్న జెఎన్‌టియు విసి రంగజనార్ధన

విద్యార్థుల విజ్ఞానం ప్రపంచానికి ఉపయోగపడాలి

టెక్ ఫెస్ట్ 2కె 23 ప్రారంభోత్సవంలో జెఎన్‌టియు విసి

ప్రజాశక్తి-అనంతపురం

ఇంజినీరింగ్ తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకున్న విజ్ఞానం ప్రపంచానికి ఉపయోగపడాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన సూచించారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ పి.సుజాత అధ్యక్షతన టెక్ ఫెస్ట్ 2కె 23 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలోని అన్ని విభాగాలు సంయుక్తగా టెక్ ఫెస్ట్ 2కె23 సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్ని విభాగాలు కలిపి నిర్వహించడం వల్ల కళాశాలలో సరికొత్త పండుగ వాతావరణం నెలకొందన్నారు. అంతేగాకుండా ఇలాంటి సదస్సులు విద్యార్థుల ప్రతిభను వెలికితీసే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు కూడా ఇలాంటి సదస్సులు వల్ల పెంచుకున్న విజ్ఞానాన్ని అందరికీ పంచాలన్నారు. అనంతరం వివిధ విభాగాల సావనీర్లు సిడిల రూపంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవానీ, మెకానికల్ విభాగాధిపతి కె.కళ్యాణి రాధ, కోఆర్డినేటర్ బి.ఓంప్రకాష్, ఇఇఇ విభాగ అధిపతి ఎన్.విశాలి, కోఆర్డినేటర్ జె.శ్రీనివాసులు, ఎం.అంకారావు, ఇసిఇ విభాగ అధిపతి డి.విష్ణువర్ధన్, కోఆర్డినేటర్ లలితకుమారి, సిఎస్ఇ విభాగ అధిపతి కె.మాధవి, కోఆర్డినేటర్ కెఎఫ్.భారతి, బి.లలిత, కెమికల్ విభాగ అధిపతి బి.దిలీప్‌కుమార్, కోఆర్డినేటర్ ఎస్.శారద, యూనివర్సిటీ డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరపాలక సంస్థ ద్వారా నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీరు మెయిన్ పంపింగ్ లైనును మార్పిడి పనులు పూర్తికానందున బుధవారం కూడా తాగునీటి సరఫరా ఉండదని ఎపిసి కమిషనర్ రమణారెడ్డి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సోమ, మంగళవారం తాగునీటి సరఫరా ఉండదని చెప్పారు. అయితే ముందుగా పేర్కొన్నట్టు రెండు రోజులు కాకుండా మూడు రోజులు పాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావున నగర ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధం

◆మరో 24 గంటలు పెనుకొండలోనే ఉంటాను..

◆వైసిపి నాయకులకు నారా లోకేష్ సవాల్

◆53వ రోజు యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్, సోమందేపల్లి

రాష్ట్రం, పెనుకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని, మరో 24 గంటలు పెనుగొండ నియోజకవర్గం లోనే ఉంటానని, దమ్ముంటే అభివద్ధిపై చర్చకు రావాలంటూ వైసిపి నేతలకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సవాల్ విసిరారు. లోకేష్ యువగళం పాదయాత్ర మంగళవారం 53వ రోజుకు చేరుకుంది. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని గుమ్మయగారిపల్లి నుంచి కొత్తపల్లి, మల్లాపల్లి, పాలసముద్రం వరకు పాదయాత్ర నిర్వహించారు. మల్లాపల్లిలో ఇటుకల తయారీ కార్మికులతో భేటీ అయ్యారు. పాలసముద్రం క్రాస్ వద్ద బీసీలతో ముఖా ముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని వడ్డెర్లు, ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకులు, నారా లోకేష్‌కు విన్నవించారు. సమస్యలను పరిష్కరించాలని మల్లాపల్లి వద్ద ఇటుకుల బట్టి వేసుకుని జీవనం సాగిస్తున్న ఫిరోజ్ బాషా నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. నిర్మాణ రంగంలో కీలకంగా ఉన్న ఇటుకల తయారీ కార్మికులకు అవసరమైన సహాయ, సహకారాలు అందజేస్తామనీ, ఇటుకల తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి షెడ్ల నిర్మాణానికి సబ్సిడీ రుణాలు ఇస్తామనీ, తయారీకి అవసరమైన మట్టి, కట్టెలకు ఉచితంగా అనుమతులు ఇస్తామనీ లోకేష్ హామీ ఇచ్చారు. సాయంత్రం పాదయాత్ర సోమందేపల్లి మండలంలోకి ప్రవేశించింది. గుడిపల్లి పారిశ్రామిక వాడ దగ్గర కియా అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు పాదయాత్రలో వస్తున్న లోకేష్‌ను కలిశారు. అనంతరం సగర ఉప్పర కులస్తులు కలిసి వారి సమస్యలను తెలిపారు. గుడిపల్లి గ్రామ ప్రజలతో లోకేష్ మాటామంతి కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. రాయినపల్లి సమీపంలో యాదవ కులస్తులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలు అందిస్తామన్నారు. టిడిపి హయాంలో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో సైతం ఇదే రకమైన అభివృద్ధి జరిగిందన్నారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గానికి ఏం చేశావని ప్రశ్నిస్తే ఆయన తనను బూతులు తిడుతున్నాడు తప్పా అభివద్ధిని చెప్పడం లేదన్నారు. ప్రజల కోసం వైసిపి నాయకులతో ఎన్ని బూతులు తిట్టించుకోవడానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అభివృద్ధి పనులపై తాను



సోమందేపల్లి మండలం వద్ద కియా అనుబంధ సంస్థ కార్మికులతో సెల్ఫీ తీసుకుంటున్న నారా లోకేష్



బిసిల సదస్సులో మాట్లాడుతున్న లోకేష్

బహిరంగ చర్చకు సిద్ధమని, ఎవరైనా దీనిని స్వీకరించవచ్చని వైసిపి నేతలకు సవాల్ విసిరారు. 2024 సంవత్సరంలో టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు రాజకీయంగా సీట్లు కేటాయించి చట్టసభల్లో అవకాశం కలిపిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను ఇవ్వండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్‌లు అందక పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లను నేరుగా విద్యార్థులకు అందిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధిని విస్మరించి పాలన సాగిస్తున్న సైకో ప్రభుత్వానికి బుద్ధి చెప్పి సైకిల్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్ధసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సబితమ్మ, మండల కన్వీనర్ సోమశేఖర్, పార్లమెంట్ కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, వేణు, జయరాం, ఫిరోజ్ బాషా, వెంకటరమణ యాదవ్ పాల్గొన్నారు.

లోకేష్‌కు జననీరాజనం..

పెనుకొండ నియోజకవర్గంలో జరుగుతున్న లోకేష్ పాదయాత్రకు టిడిపి శ్రేణులు జననీరాజనం పలుకుతున్నారు. పెనుకొండ నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిమానాన్ని చాటుతున్నారు. లోకేష్‌తో సెల్ఫీలు తీయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొత్తపల్లి వద్ద హిందూపురం పార్లమెంట్ టిడిపి కార్యదర్శి నరసింహులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర వెళ్తున్న గ్రామాల సమీపంలో ఆయా గ్రామాల టిడిపి నాయకులు భారీ పూలమాలలతో స్వాగతం పలుకున్నారు.

రైతు పొలాలపై మట్టిమాఫియా

◆అనుమతులు లేకుండా తవ్వకాలు

◆మట్టి మాఫియాపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం మండలంలో అధికార పార్టీ నాయకుల మట్టి మాఫియా పేట్రేగిపోతోందని, వీరిపై చర్యలు తీసుకుని రైతులను కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఓ.నల్లప్ప, మండల కార్యదర్శి కుళ్లాయప్పలు మంగళవారం నాడు విలేకరులతో మాట్లాడుతూ బుక్కరాయసముద్రం నక్కలతిప్పకొండలో మట్టి తవ్వుకునేందుకు అధికార పార్టీ నాయకుడు లీజు పొందాడన్నారు. సదరు నేత అక్కడితో ఆగకుండా కొండ సమీపంలోని రైతుల పొలాల్లో మట్టిని కూడా తవ్వి విక్రయిస్తున్నాడని చెప్పారు. సర్వే నంబర్ 396-7లో బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన కూరపాటి నారాయణ శెట్టి తన కుమారులైన కె.సురేష్ రాజా, సుధాకర్‌లకు పిత్రార్జితంగా భూమి వచ్చిందన్నారు. ఖాతా నెంబర్ 1276, 1277లో వీరు హక్కులు కలిగి ఉన్నారన్నారు. ఈ పొలాల్లో చికెన్ నారాయణస్వామి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. బాధితులు ప్రత్యక్షంగా లీజు దారునితో మాట్లాడితే మట్టి తరలింపును ఆపేది లేదని, దిక్కున్న చోటు చెప్పుకో అని బెదిరిస్తున్నారని తెలిపారు. మట్టి మాఫియా చేస్తున్న అక్రమాలను పదేపదే సిపిఎం జిల్లా అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులకు తెలియజేస్తున్నా వారు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా బాధిత రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తిపై రెవెన్యూ అధికారులు స్పందించి, మట్టి మాఫియా అరాచకాలపై ఉక్కుపాదం మోపాలని కోరారు. లేకుంటే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలియజేశారు.

2047కు భారత్ మరింత అభివృద్ధి

జెఎన్‌టియు స్పోర్ట్స్‌డేలో జెఎన్‌టియు విసి

ప్రజాశక్తి-అనంతపురం

2047కు మరింత అభివృద్ధి చెంది విశ్వగురుగా భారత్ అవతరిస్తుందని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల వార్షిక క్రీడా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ పి.సుజాత అధ్యక్షత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండేందుకు క్రీడలు చాలా అవసరమన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో గెలుపొందే విన్నర్‌కి, రన్నర్‌కు కేవలం క్షణం మాత్రమే తేడా ఉంటుందన్నారు. అనంతపురం జెఎన్‌టియు విద్యతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశంలో కార్యదర్శి పెట్టిన ప్రతిదానికీ ఆమోదించడమేగాకుండా అందుకు అవసరమైన నిధులు కూడా ఏడాదికి రూ.16.5 లక్షలు నిధులు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్.భవానీ, వర్శిటీ డైరెక్టర్లు కేశవరెడ్డి, సురేష్, పొఫెసర్ శివకుమార్, మాధవీ, మమత, కల్యాణి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ ఆర్‌డికి సిఐటియు నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాయదుర్గం పట్టణంలోని మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర యాదవ్‌ను విధుల నుంచి తొలగించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, న్యూటౌన్ కార్యదర్శి మూర్తజా డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం నగరంలోని కార్యాలయంలో మున్సిపల్ ఆర్‌డి పివివిఎస్.మూర్తిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయదుర్గం శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర యాదవ్ పారిశుధ్య కార్మికులను తన వ్యక్తిగత పనులకు వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. అధికార ముసుగులో చెరుకు గడల వ్యాపారం నిర్వహిస్తూ రోజూ 8మంది కార్మికులతో తన సొంత పనులు చేయించుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగానే గత సోమవారం పారిశుధ్య కార్మికుడు హెచ్.తిప్పేస్వామి చెరుకు గడలు కట్టింగ్ చేస్తుండగా కొడవలి తగిలి చేయి మణికట్టు వద్ద లోతుగా తెగి పెద్ద గాయమైందన్నారు. కనీసం ఆసుపత్రికి తరలించిన పాపాన పోలేదన్నారు. ఆఖరికి కార్మికులే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు తప్ప ఆయన పట్టించుకోలేదని వాపోయారు. అదేవిధంగా శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఇంట్లో పని చేయడానికి రోజూ ఇద్దరు మహిళల చొప్పున వారి ఇంటికి వెళ్లాలన్నారు. వెళ్లకుంటే వేధింపులకు గురి చేస్తాడన్నారు. దీనికితోడు హిందూపురంలో నిర్మిస్తున్న తన రెండస్థుల భవన నిర్మాణానికి మున్సిపల్ కార్మికులను కూలీలుగా వాడుకున్నాడన్నారు. కొంతమంది పర్మినెంట్ కార్మికుల ఆరోగ్యం బాగాలేక బదిలీ చేయమని అడిగితే రూ.8 నుంచి రూ.10వేల వరకూ లంచం వసూలు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇతడిపై ఇన్ని ఆరోపణలు వస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం



మున్సిపల్ ఆర్‌డికి ఫిర్యాదు చేస్తున్న సిఐటియు నాయకులు

చేస్తామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన ఆర్‌డి మూర్తి రాయదుర్గం కమిషనర్‌కు ఫోన్ చేసి ఘటనపై విచారించి పూర్తి నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ లక్ష్మీనరసమ్మ, నగర మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మి, జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, కమిటీ సభ్యులు రాఘవేంద్ర ప్రసాద్, మరియమ్మ, బాబు, కుళ్లాయప్ప, ఆదినారాయణ, నారాయణస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



మొక్క నాటుతున్న దృశ్యం

ప్రకృతిని కాపాడుకుందాం

ఉరవకొండ : మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకుందామని ఆదర్శ ఉపాధ్యాయులు రాజేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఎస్ఐ వెంకటస్వామి, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేష్‌తో కలిసి మంగళవారం పట్టణంలోని పోలీస్ మైదానంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి

నార్పల : మేజర్ పంచాయతీ పరిధిలో వందశాతం ఇంటి, కొళాయి పన్నులతోపాటు అంగడి లైసెన్సులు వసూలు చేయాలని ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సచివాలయాల వాలంటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వాలంటరీ ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ సెక్రటరీ అశ్వర్థమనాయుడు, సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ భద్ర ప్రాజెక్ట్‌తో రాయలసీమకు ముప్పు

ఉరవకొండ : కర్ణాటక రాష్ట్రంలో తుంగభద్ర ప్రాజెక్టు ఎగువన అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమకు నీటి ముప్పు పొంచి ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో కర్ణాటకలో జరిగే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టుకు పూనుకుందన్నారు. ఇందుకు కేంద్ర జల శక్తి మండలి సైతం ఆమోదం తెలిపి జాతీయ ప్రాజెక్టుగా గుర్తించడం శోచనీయమన్నారు. అప్పర్ భద్ర ప్రాజెక్టు వల్ల రాయలసీమ జిల్లాల ప్రజలకు జరిగే నష్టాన్ని వివరించేందుకు సిపిఐ, రైతుసంఘం సంయుక్తంగా ఏప్రిల్‌లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రైతుసంఘం జిల్లా నాయకులు గోవిందు, తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సీనియర్ నాయకులు శివన్న, ఉరవకొండ మండల కార్యదర్శి మల్లికార్జున, వజ్రకరూరు మండల కార్యదర్శి సుల్తాన్, రైతుసంఘం నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో పంటకోత ప్రయోగం

ఆత్మకూరు : మండల పరిధిలోలోని తలుపూరు గ్రామంలో రైతు టి.ఇందిరమ్మ సాగుచేసిన వేరుశనగ పొలంలో అధికారులు మంగళవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో భాగంగా సర్వే నెంబర్ 80-11లో సాగు చేసిన రబీ వేరుశనగలో పంటకోత ప్రయోగం నిర్వహించగా 300 గ్రాముల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, వడ్డుపల్లి, తలుపూరు సర్పంచులు ఓబులేసు, నరసింహారెడ్డి, ఎంపిటిసి ఓబులేసు, ఎఇఒ సుజిత, ఎఎస్ఒ మమత, ఎంపిఇఒ భారతి, రైతులు పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

5న చలో ఢిల్లీకి తరలివెళ్దాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా వచ్చేనెల 5న కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌వి.నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీకి సంబంధించిన గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు, కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు చలో ఢిల్లీకి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణస్వామి, శంకర్, కోశాధికారి సుబాన్, మేస్త్రీలు విజయ్, నాగరాజు, రామచంద్ర, వెంకటప్ప, శంకర్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి విమర్శించారు. మంగళవారం ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీకి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతోందన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారం చేపట్టి బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యంగా అధికార, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందన్నారు. అంతేగాకుండా బడాబాబుల కొమ్ముకాస్తూ ప్రయివేటు వ్యక్తులకు అనుకూలంగా చట్టాలను రద్దు చేస్తూ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం మెడలు వంచేందుకు ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేశులు, రాము తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ఆత్మకూరు : వచ్చేనెల 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం మండలం కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. ఈసందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికులు, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, రమాదేవి, మండల నాయకులు శివశంకర్, మధ్యాహ్న భోజన కార్మికులు మీనాక్షి, సుబ్బమ్మ, మారెక్క, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

డిఇఒ ఎం. సాయిరామ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

వచ్చేనెల 3వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ తెలిపారు. మంగళవారం నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏసీ గోవిందనాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 139 పరీక్ష కేంద్రాల్లో 35,310 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఇప్పటికే ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించి భద్రపరిచామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించామన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కేంద్రాల వద్ద మెడికల్ సిబ్బంది ఒఆర్ఎస్ ప్యాకెట్లను నిల్వ ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లు చూపిస్తూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. ఉదయం 9:30 గంటల నుండి 12:45 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆయా కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీలు జరగకుండా ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, అవసరాన్ని బట్టి సిట్టింగ్ స్క్వాడ్స్, 139 మంది చీఫ్ సూపర్డెంట్లు, 139 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, దాదాపు 1500 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న డిఇఒ ఎం సాయిరాం

ఫాదర్‌ఫెర్రర్‌కు నివాళి

ప్రజాశక్తి-నార్పల


రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి) వ్యవస్థాపకులు జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎకాలజీ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, ఎంపిటిసి శంకర్‌యాదవ్ మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు ఆర్డీటీ ఎనలేని కృషి చేస్తోందన్నారు. అలాగే ఎప్పుడూ ఒకరితో సాయం పొందడమే కాకుండా మనం కూడా సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. గ్రామ కమిటీ ఏర్పాటు చేసి భూమి అభివృద్ధి పనులు, పండ్ల మొక్కల పెంపకం, డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, కుంటలు, చెక్ డ్యాముల నిర్మాణం, డెయిరీ కార్యక్రమం ద్వారా పాడి పశువులను అందించడం, గోబర్ గ్యాస్, పెరటి కోళ్ల పెంపకం వంటి ఎన్నో కార్యక్రమాలను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం స్పందించు సాయమందించు హుండీల నుంచి వచిన రూ.లక్షను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎల్ నరసింహయాదవ్, పప్పూరు బ్యాంకు మేనేజర్ హరికృష్ణ, ఎస్‌టిఒ అశోక్‌కుమార్, ఎస్ఎంఎస్ కిషోర్, పి.శివయ్య, సూరప్ప, పర్యావరణ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగప్ప, నారాయణస్వామి, ఓబులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు 'కోరమాండల్' చేయూత

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

బాలికల విద్యకు కోరమాం డల్ సంస్థ చేయూతనివ్వడం అభినంద నీయమని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. మంగళవా రం అనంతపురంలోని తనుశ్రీ ఫంక్షన్ హాల్లో ప్రతిభ కలిగిన ప్రభుత్వ పాఠశాల లో చదివే విద్యార్థినులకు కోరమాండల్ సంస్థ స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరిజమ్మ మాట్లడుతూ వ్యాపార రంగంలో తమదైన ముద్ర వేసుకున్న కోరమాండల్ సంస్థ సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల వల్ల విద్యారంగంలో తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుందన్నారు. బాలికలు కూడా ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఎడిఎ వెంకటరాముడు, ఎఇ వెంకటేశ్వరప్రసాద్, డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, కంపెనీ డిజిఎం గోవిందరావు, సీనియర్ అగ్రానమిస్ట్ శ్రీధర్‌రెడ్డి, ప్రతినిధులు ఫణి రామ్‌కుమార్, వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ


నేడు 'ఆసరా' చెక్కు పంపిణీ

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని పుట్లూరు రోడ్డులో ఉన్న ఎఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మహిళా సంఘాలకు ఆసరా పథకం కింద మంజూరైన చెక్కును బుధవారం అందజేయనున్నట్లు ఎంపిడిఒ రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కావున మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పుట్లూరు

ఇటీవల కురిసిన భారీ వడగండ్ల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ సుమతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఈనెల 18న కురిసిన అకాలవర్షాలకు మండలవ్యాప్తంగా అరటి, నిమ్మ, మొక్కజొన్నతోపాటు వివిధ రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అయితే ఇప్పటి వరకూ కనీసం రైతులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. ఆఖరికి ఎంత నష్టం సంభవించిందో కూడా లెక్కలు తేల్చలేదన్నారు. అలాగే అగ్ని ప్రమాదాల కారణంగా నాశనమైన పంటల రైతులను కూడా ఆదుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.టి.రామాంజినేయులు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్.సూరి, మండల నాయకులు జి.వెంకటచౌదరి, పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, వెంకటశేఖర్, పూల రంగడు, నాగసుబ్బరాయుడు, నాగమునేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ సుమతికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

రాజకీయ విప్లవం తెచ్చిన ఎన్టీఆర్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత స్వర్గీయ నందమూరి తారకరామారావు స్థాపించిన టిడిపికే దక్కుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు తెలిపారు. మంగళవారం పట్టణ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి ఆవిర్భవించి బుధవారం నాటికి 41 ఏళ్లు పూర్తి చేసుకుని ప్రజలు, కార్యకర్తల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఇందులో భాగంగా నేడు రాయదుర్గం టిడిపి కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ గా వెళ్లి పూలమాల వేసి నివాళు లర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఇనాయత్, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, వాణిజ్య సెల్ అధ్యక్షుడు వెంకటేశులు, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, తిప్పేస్వామి, వెంకటేశులు, వేణు, రాజశేఖర్, కరెన్న, ఖలందర్, తిప్పేస్వామి, అంజి, లోకేష్, రవి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

మున్సిపల్ మార్కెట్ వేలంపాట వాయిదా

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలో 2023- 24 ఆర్థిక సంవత్సరానికి దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత మార్కెట్, జంతువధశాల మార్కెట్‌లకు వేలంపాటను మరోసారి వాయిదా వేసినట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. వేలంపాట వాయిదా వేయడం ఇది రెండో సారి ఈనెల 25వ తేదీ మార్కెట్ వేలంపాట నిర్వహించాల్సి ఉండగా వివిధ కారణాల వల్ల వాయిదా పడింది. మంగళవారం తిరిగి రెండోసారి వేలంపాట నిర్వహిస్తుండగా వేలంపాటదారులు వాగ్వివాదానికి దిగడంతో మరోసారి వాయిదా పడింది. ముందుగా వేలంపాట సాగుతుండగా కొందరు వేలంపాట దారులు వాగ్వివాదానికి దిగారు. ధరావతు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొన్న వారికి మాత్రమే అనుమతించినప్పటికీ ఒకరికొకరు కొట్టుకునే పరిస్థితి తలెత్తింది. పోలీసులు నివారించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక వేలంపాట వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు.



గుమిగూడిన వేలంపాటదారులు

గుత్తి డిపోలో ప్రపంచ స్థాయి ఆటోమేటెడ్ సదుపాయం


బిపిసిఎల్ టెర్మినల్ మేనేజర్ మనోజ్ కన్నిరియల్

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ డిపోలో ప్రపంచ స్థాయి ఆటోమేటెడ్ సదుపాయం ఉన్నట్లు నెల్లూరు రిటైల్ టెర్మినల్ మేనేజర్ మనోజ్ కన్నిరియల్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర అధికారుల ద్వారా అన్ని ఆమోదాలతో 2014 ఫిబ్రవరి 2న పట్టణ శివారులో బిపిసిఎల్ డిపో ప్రారంభమైందన్నారు. ఈ డిపో ద్వారా అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలు, చిత్తూరులోని పలు ప్రాంతాలకు నిరంతరాయంగా ఇంధనం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. 2018లో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కోసం హాస్పిటాలిటీ ఏర్పాట్లను ప్రారంభించామన్నారు. అయితే తమ డిపోలో ఈనెల 15వ తేదీ నుంచి హెచ్‌పిసిఎల్‌కు ఇందన సరఫరా నిలిపివేయాలన్న ఆదేశాల మేరకు బంద్ చేశామన్నారు. హెచ్‌పిసిఎల్‌కు కడప టెర్మినల్‌కు సరఫరా మార్చినట్లు తెలిపారు. తమ డిపో ద్వారా బిపిసిఎల్ కు సంబంధించిన బంకులకు నిరంతరాయంగా ఇంధనం సరఫరా చేస్తున్నామని వివరించారు.

పోలీసుల కార్డెన్‌సెర్చ్

తాడిపత్రి రూరల్ : ఎస్పీ ఫక్కీరప్ప ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో రూరల్ సీఐ చిన్నపెద్దయ్య ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ట్రబుల్ మాంగర్లు, రౌడీషీటర్లు, ఫ్యాక్షనిస్టుల ఇళ్లు,గడ్డివాములు, అనుమానిత ప్రదేశాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐతో పాటు రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

నేరాలు ఘోరాలు

ఆర్టీసీ బస్సు కిందపడి వ్యక్తి మృతి



ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తాడిపత్రి రూరల్ : ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు కిందపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామం వద్ద మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం మధ్యాహ్న బొందలదిన్నె గ్రామానికి చెందిన కోటా ప్రతాప్‌రెడ్డి (42) స్వగ్రామానికి వెళ్తుండగా కడప-తాడిపత్రి ప్రధాన రహదారి దాటుతుండగా కడప నుంచి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ప్రతాప్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ డీలర్ల సమావేశం

యాడికి : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ అలెగ్జాండర్ మాట్లాడుతూ లబ్ధిదారులందరికీ రేషన్ తప్పనిసరిగా అందజేయాలని, తూకాల్లో మోసం చేస్తే సంబంధిత డీలర్లపై చర్యలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి సూర్యనారాయణ, డీలర్లు వల్లూరు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, రామ్మోహన్, రామచంద్ర, ఎండియు ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

గార్లదిన్నె : మండల పరిధిలోని కణంపల్లి గ్రామంలో మంగళవారం చేపట్టిన ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ విజయభాస్కర్ పరిశీలించారు. ఇందులో భాగంగా కూలీలకు కల్పిస్తున్న మౌలిక వసతులు, రోజువారి కూలి వివరాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ నాంచారమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ విజయభాస్కర్

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవేంద్ర

కళ్యాణదుర్గం : స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది దేవేంద్ర ఎన్నికయ్యాడు. ఈమేరకు బార్ అసోసియేషన్ సభ్యులందరూ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవేంద్ర మాట్లాడుతూ కళ్యాణదుర్గం న్యాయవాదుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

బైక్ మరమ్మతులపై ఉచిత శిక్షణ

కళ్యాణదుర్గం : స్థానిక ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నిరుద్యోగులకు బైక్ రీపేరి కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం టూల్ కిట్‌తోపాటు సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ (పాత ఆర్డీటీ ఆసుపత్రి-దొడగట్ట రోడ్డు), సెల్..99594 22884, 63035 80397, 77807 52418 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇన్‌ఛార్జి జిసిడిఒగా శాంతాబాయి



అనంతపురంసిటీ : అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష ఇన్‌ఛార్జి జిసిడిఒగా శాంతాబాయి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న జిసిడిఓ రెబెకా (స్కూల్ అసిస్టెంట్)ని నాలుగు రోజుల క్రితం కలెక్టర్ మాతృశాఖకు సరెండర్ చేశారు. దీంతో గార్లదిన్నె మండలం కొప్పలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న శాంతాబాయిని ఇన్‌ఛార్జిగా నియమిస్తూ డిఇఒ ఎపిసి ఎం.సాయిరామ్ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తానన్నారు. అంతేగాకుండా జిల్లాలోని కేజీబీవీల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

'శ్రీచైతన్య'లో అబాకస్ పోటీలు

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో జోనల్ వారీగా అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈపోటీలను ఎజిఎం సుబ్బారెడ్డి, ఎస్‌వి యూనివర్సిటీ డాక్టర్ వెంకటరమణ, ఆనంద్ దంపెల్ల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు తబస్సుం, శాంతా, పర్వీన్, నేత్రావతి, శ్రీదేవి, ఫిలిప్ బాబు, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రీ ప్రైమరీ జోనల్ ఇన్‌ఛార్జి సబిత, ఆర్ట్ టీచర్లు మధు, అఫ్రీన్, అశ్విని ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ, భారతి, చంద్రకళ, దేవకృప, రమాదేవి, మాధవి, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యార్థిని

వైసిపి రైతు ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే విశ్వ

బెలుగుప్ప : తమది రైతు పక్షపాతి ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రగుడి, అంకంపల్లి గ్రామాల్లో వైఎస్ఆర్ జలకళ కింద రైతులకు మంజూరైన ఉచిత వ్యవసాయ మోటార్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా అంతకంటే ఎక్కువగా రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టారన్నారు. దివంగత సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల కోసం ముందుకు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకంపల్లి సర్పంచు రుద్రానంద, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, వైస్ ఎంపిపి పుష్పావతి, నాయకులు త్రిలోక్‌రెడ్డి, నరిగన్న, రఘురాములు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



బోరు పరికరాలు పంపిణీ చేస్తున్న విశ్వేశరరెడ్డి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

గుత్తి : శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని శ్రీరామస్వామి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శివప్రసాద్, ఎంకె.చౌదరి మాట్లడుతూ శ్రీరాముని గుణగణాలను చిన్నప్పటిన ఉంచే విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా ఎల్లప్పుడూ సత్యం మాట్లాడటం, తల్లిదండ్రులను గౌరవించడం, సోదరులను ప్రేమించడం వంటి సద్గుణాలను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దేశాయ్ నాగరాజు, రఘురాం, హాజీమలంగ్, శ్రీ రామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ఉప కోశాధికారి రామానాయుడు, ప్రచార కన్వీనర్ విజయభాస్కర్, కమిటీ సభ్యులు రామకృష్ణ, శేషా చలపతి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

సిఎం జగన్‌కు మహిళలు తోడుండాలి - మంత్రి ఉషశ్రీచరణ్




కుందుర్పిలో మెగాచెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-కుందుర్పి

కార్యకర్తలు ఎవరూ అధైర్య పడవద్దని.. తాను ఎల్లవేళలా అండగా ఉంటానని మంత్రి కెవి.ఉషశ్రీచరణ్ భరోసా ఇచ్చారు. ఎంపిపి కమలా నాగరాజు అధ్యక్షతన మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత మెగా చెక్కు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక తెలుగు తమ్ముళ్లు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వీటన్నింటినీ దీటుగా ఎదుర్కొని రాబోయే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలతో కలిసి సిఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాధాస్వామి, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సర్పంచి మారుతీశ్వర రామమూర్తి, వైస్ఎంపిపిలు శ్రీలక్ష్మి అజయ్‌బాబు, బిజీ సోమనాథ్, ఎంపిటిసి గంగమ్మ హనుమంతురాయుడు, కో ఆప్షన్ సభ్యుడు ముజీవుల, వాల్మీకి స్టేట్ డైరెక్టర్ పాలాక్షి, సింగిల్‌విండో ఛైర్మన్ వన్నూర్‌రెడ్డి, ఎంపిడిఒ నారాయణస్వామి, తహశీల్దార్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంకార్పొరేషన్ : మీ భవిష్యత్, మీ పిల్లల భవిష్యత్ గురించి ఆలోచిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న విద్యుత్ కళాభారతి ఫంక్షన్ హాల్‌లో 'వైఎస్ఆర్ ఆసరా' వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా 80 లక్షల మహిళా సైన్యం మన రాష్ట్రంలో ఉందన్నారు. వారందరినీ పేదరికం నుంచి బయటకు తీసుకురావాలని సిఎం జగన్ ఆసరా కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏటా రూ.6 వేల కోట్లకుపైగా వైఎస్ఆర్ ఆసరా పథకం కింద రుణమాఫీ చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. జిల్లాలో మూడో విడతలో రూ.236.66 కోట్లు అందించినట్లు తెలిపారు. ఒక్క అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలోనే మూడు విడతల్లో రూ.75 కోట్లు అందించారని గుర్తు చేశారు. మహిళలు, ప్రజలకు సిఎం జగన్ మంచి చేస్తుంటే ప్రతిపక్షాలు కుట్రలు చేయడం బాధాకరమన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు లేదన్నారు. గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ పనులు చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. అలాగే కళ్యాణదుర్గం బైపాస్ నుంచి కలెక్టరేట్ మీదుగా పంగల్ రోడ్డు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. టవర్‌క్లాక్ సమీపంలోని బ్రిడ్జి మరో 30 రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. అలాగే నగరంలో 23 వేల మందికి ఇంటి పట్టాలు అందించామని, గృహ నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. టిడ్కో ఇళ్లను కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. కావున ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిన సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. తర్వాత సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమణారెడ్డి, మెప్మా పీడీ సావిత్రి, సెక్రటరీ సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు ఎం.దేవి, వై.లక్ష్మిదేవి, బోయ సుమతి, నాగమణి, లాలెప్ప, కమల్‌భూషణ్, వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మన్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



అనంతపురంలో మెగాచెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

పెద్దపప్పూరు : మహిళలు అభివృద్ధి చెందితేనే కుటుంబం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పెద్దారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో మహిళా సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా మూడో విడత మెగాచెక్కు అందజేశారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 474 మహిళా గ్రూపులకు రూ.329 కోట్ల మూడో విడత రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసి రాజ్యలక్ష్మి, ఎపిఎం రవిచంద్ర రాజు, ఎంపిడిఒ రామకృష్ణ, జడ్పిటిసి రమాదేవి, జాతీయ ఉపాధి హామీ పథకం నెంబర్ వేమనాథరెడ్డి, అధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు రామేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, రాము, జనార్ధన్‌రెడ్డి, తురకపల్లి లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

బెలుగుప్ప: మండల కేంద్రంలో మహిళా సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కింద మంజూరైన మెగాచెక్కు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 775 సంఘాలు, 7,750 మంది మహిళా సభ్యులకు రూ.589 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దపప్పూరులో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

బండూరులో ప్రత్యేక పూజలు

బొమ్మహాళ్ : మండల పరిధిలోని బండూరు గ్రామంలో వెలసిన మారమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ పెద్దలు హనుమంతరాయుడు తెలిపారు. ఇందులో భాగంగా వేకువజామునే వేదవతి నుంచి పవిత్ర గంగను తీసుకొచ్చి అమ్మవారికి పన్నీటి స్నానాలు ఆచరించి, పసుపు కుంకుమను అర్పించి వడిబియ్యం కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికి సన్మానం

ఉరవకొండ : ఆప్కోస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఆఫ్ ఔట్‌సోర్స్ సర్వీసెస్)లో విలీనం చేయడాన్ని హర్షిస్తూ మహాత్మా జ్యోతిరావు పూలే బిసి గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. మంగళవారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని నివాసంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి విన్నవించారన్నారు. ఇందుకు స్పందించిన శివరామిరెడ్డి తమ సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1400 మంది ఉద్యోగులను అప్కోస్‌లోకి విలీనం చేస్తూ ఉత్వర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఇందుకు శాయశక్తులా కృషి చేసిన శివరామిరెడ్డి సేవలను మరువలేమన్నారు.



శివరామిరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

నేడు 'సందర్భం' సమాలోచనలు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'సందర్భం' పేరుతో పౌర సమాజపు సమాలోచనలు మళ్లీ ప్రారంభమవుతున్నాయని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే అంశంపై చర్చతో ఈ సమాలోచనలు ప్రారంభమౌతాయన్నారు. ఇప్పటి నుంచి మళ్లీ ప్రతినెలా చివరి బుధవారం ఈ సమావేశాలు ఉంటాయన్నారు. అనంతపురంలోని మేధావులు, సామాజిక కార్యకర్తలు, రచయితలు, కళాకారులు, విద్యార్థులు, సంఘాల ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ఎస్‌కెయు విసి జన్మదిన వేడుకలు



కేక్ కోస్తున్న దృశ్యం

అనంతపురం : ఎస్‌కెయు ఉపకులపతి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక పరిపాలనా భవనంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బోధనా, బోధనేతర సిబ్బంది కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ లింగారెడ్డి, జిల్లా అధ్యక్షులు తిప్పలూరి సుధీర్‌రెడ్డి, నాయకులు పి.హేమంత్‌కుమార్, సునీల్, తేజేశ్వర్‌రెడ్డి, శివ, బాబా, మోహిత్, నితిన్‌రెడ్డి, నెహమ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డిజిపిని కలిసిన సాంబశివారెడ్డి

శింగనమల : విజయవాడలోని మంగళగిరి డిజిపి కార్యాలయంలో డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ సమస్యలను డిజిపికి వివరించినట్లు సాంబశివారెడ్డి తెలిపారు.



డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డికి బహుమతి అందజేస్తున్న సాంబశివారెడ్డి

నారాయణరెడ్డి క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-ఉరవకొండ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం ప్రారంభమైన దివంగత రాకెట్ల నారాయణరెడ్డి మెమోరియల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసిపి యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు వై.ప్రణయ్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టాస్ వేసి టోర్నమెంటును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు చంద్రమ్మ, కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి, జెడ్పిటిసిలు ఏసీ పార్వతమ్మ, హనుమంతు, సర్పంచి లలితమ్మ, ఉప సర్పంచి వన్నప్ప, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, పిఎసిఎస్ ఛైర్మన్లు తేజోనాథ్, శ్రీరాములు, టోర్నమెంట్ నిర్వాహకులు ధనరాజ్, మల్లికార్జున, నియోజకవర్గంలోని వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మరో కార్యక్రమంలో వైసిపి జోనల్ యూత్ అధ్యక్షుడిగా ప్రణయ్‌రెడ్డి ఎన్నికైన సందర్భంగా 15వ వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రణయ్‌రెడ్డి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.



బ్యాటింగ్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైసిపి యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు ప్రణయ్‌రెడ్డి

'ఉయ్యాలవాడ' శిలాఫలకం ధ్వంసం బాధాకరం

ప్రజాశక్తి-ఆత్మకూరు

చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటు చేసేందుకు శంఖుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం బాధాకరమని ఎపి సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రేనాటి నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. సోమవారం రాత్రి కొందరు దుండగులు స్వాతంత్ర్య సమరయోధుడి విగ్రహం ఏర్పాటు చేయకుండా అడ్డుకునేందుకే ఇలా చేశారన్నారు. ఇలాంటి నీచమైన సంస్కృతిని ప్రతి భారతీయుడూ వ్యతిరేకించాలన్నారు. ప్రభుత్వం వెంటనే దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.